# సమ్(?)బంధాలు

## ఉపోద్ఘాతం

గేట్‌వే ఆఫ్ ఇండియా! మన దేశ కవాటం! అరేబియా సముద్రపు ఊసులు వింటూ, తన దగ్గరకు వచ్చే సందర్శకుల సేద తీరుస్తూ, ఎందరో చిన్నా, చితకా, చిల్లర వ్యాపారులకు జీవనోపాధి కల్పిస్తూ, నిన్నటి బొంబాయి, నేటి ముంబయికి తలమానికమై నిలబడ్డ కట్టడం. ఒకనాటి బ్రిటిష్ ఇంపీరియలిస్టుల ప్రవేశానికి చెరగని గుర్తు. రెండు వందల సంవత్సరాల పరిపాలన సమాప్తమైనా, గతాన్ని గుర్తుచేస్తూ రాబోయే శతాబ్దాల్లోకి తొంగిచూస్తున్న కట్టడం.

సాయంత్రం అయిదయింది. సముద్ర విహారం చేయించే ఓడల సంఖ్య పెరిగింది. ఎలిఫెంటా గుహలకు పోయే బోట్ల రద్దీ తగ్గింది. సందర్శకులు టీ, ఫలహారాలమ్మే వాళ్లను ఆశ్రయిస్తున్నారు. ఫోటోగ్రాఫర్లు ఆల్‌బమ్‌లు చూపిస్తూ పర్యాటకులను ఆకట్టుకుంటున్నారు. కొందరు వలయంగా ఏర్పడి కోతి విన్యాసాలను చూస్తున్నారు.

ఓ మూల, సిమెంటు చప్టాపై కూర్చున్న రాజారాం, తన లోకంలో ఉన్నాడు. సముద్రపుటలల్లాగే అతని మనసు అల్లకల్లోలంగా ఉంది. ఎదురుగా తాజ్ ఇంటర్ కాంటినెంటల్స్! మన దేశంలో అత్యంత ఖరీదైన హోటల్! అక్కడ తను ఎన్ని పార్టీలకు హాజరయ్యాడో! ఇపుడు? అక్కడేకదూ, హిమ్మత్ భాయితో కరచాలనం చేసింది? అప్రయత్నంగా చేతులు చూసుకున్నాడు. రేఖలు గజిబిజిగా ఉన్నాయి. ఇదంతా తలరాతా... న్నో...

### రాజారాంలోని రణగొణ..

కారు పార్కు చేసి వెనక్కి తిరగగానే రెండు చేతులూ చాచి హిమ్మత్‌భాయి..

ఆహ్వానిస్తూ... అతన్ని చూస్తే చాలు పెదవులు నాకు తెలియకుండానే విచ్చుకుంటాయి. మనిషి చాలా విచిత్రంగా ఉంటాడు. ముఖ్యంగా అతని మాటలు వినాలనిపిస్తుంది. లోపలికి వెళ్లాక అతను చూపిన నమ్రత, నేను జీవితంలో మరువలేను.

అతన్తో తొలి పరిచయం తాజ్‌లో ఇండియన్ మర్చంట్స్ ఛాంబర్ ఆధ్వర్యాన జరిగిన సెమినార్లో జరిగింది. మా ఉత్పత్తుల ఎగుమతి అవకాశాల్ని అంచనా వేయడానికి ఓ సదస్సు నిర్వహించారు. ఆరోజు హిమ్మత్‌భాయి నాకేసి గుచ్చిగుచ్చి చూడటం నేను గమనించాను. అది నాకు గర్వకారణం.. అలాగే నేను గుచ్చిగుచ్చి చూశాను.. చాలామందిని ఆ తర్వాత రెండు మూడు 'వెట్' పార్టీల్తో మా బంధం గట్టిపడింది.

"జుహూ సెంటార్ హోటల్"

మారుతి థౌజెండ్ స్వయంగా డ్రైవ్‌చేసుకుంటూ వచ్చాడు హిమ్మత్‌భాయి. అప్పటికే

నేను లాంజ్‌లో కూర్చున్నాను. పర్మిట్ రూంలోకి వెళ్లాం. అతను పక్కా శాకాహారి. వాళ్లింట్లో దుంపలు, ఉల్లి, వెల్లుల్లి కూడా నిషిద్ధం. మద్యం ప్రసక్తే లేదు. కానీ తను పార్టీలిస్తాడు. జ్యూస్ మాత్రం తాగుతూ, ఎవరికేం కావాలో అది ఆర్డరు చేస్తూ, కొసరి కొసరి తినిపిస్తాడు, తాగిస్తాడు. ఆరోజు మొదటిసారి అతని సంభాషణ, కొత్త మలుపు తిరిగింది.

అతను హిందీలో "రాజాసాబ్, పురుషోత్తం జీ మీకు బంధువు కదా. కంపెనీలో మీకు వాటా ఇచ్చే ఉంటారు. చాలా మంచి మనిషి" అంటూ ప్రారంభించాడు.

"పురుషోత్తంగారు నాకు బంధువులే. మామ వరసవుతారు. ఆయన కంపెనీలకు చెంది నాకెలాంటి వాటా లేదు." హిమ్మత్‌భాయి ఫీలింగ్ చూసి నాకెంత నవ్వు వచ్చిందో!

"అదేంటి భాయ్? కంపెనీ మొత్తం నడిపించేది మీరు. మీకు షేర్ లేదంటే నమ్మలేకపోతున్నాను" అన్నాడు.

"మీరు నమ్మినా నమ్మకపోయినా, అది నిజం. నేను నెలజీతం తీసుకునే ఉద్యోగినే. మామయ్య చలవవల్లే ఈరోజు ఈ పొజిషన్‌లో ఉన్నా."

"రాజా సాబ్, అది మీ వినయం... నేను అర్థం చేసుకోగలను. కానీ మీతో నేను ఏకీభవించలేను" అన్నాడు.

నేను నా ముందు గ్లాసందుకుని గల్ప్ చేసాను.

సరిగ్గా రెండున్నర గంటల సమావేశమది. హిమ్మత్‌భాయికి వీడ్కోలు పలికాక కంపెనీ కారు డ్రైవ్ చేసుకుంటూ వచ్చాను. బాంద్రాలో నా నివాసం. సొంత ఫ్లాటు. ఇంట్లోకి నడుస్తుంటే నిన్నటిదాకా ఎంత గర్వమో... ఎందుకో మనసు తూలుతోంది. కళ్ళు ఎర్రబడ్డాయేమో! విచిత్రంగా చూసింది "మానసి." మానసి నా భార్య, మాకు ఇద్దరు పిల్లలు...

"నన్ను కొంచెంసేపు ఏకాంతంగా ఉండనీ" అని ఫ్రిజ్ తెరిచి, నా గదికి సరంజామాతో చేరిపోయాను.

"మీరేమనుకోనంటే ఓ మాట చెబుతా. మీ మావయ్య ఇవన్నీ మీకు పుక్కట్‌గా ఇవ్వలేదు. అంతెందుకు? నాకివ్వమంటే ఇస్తాడా? మీ శ్రమ, అంతకుమించి మీ సామర్థ్యం గురించి ఆయనకు బాగా తెలుసు. మీరు జాయినయిన కొత్తలో టర్నోవరు ఎంత? సేల్సెంత?

జస్ట్ టూ క్రోర్స్. ఇపుడు గ్రాఫ్ ఏమిటి? మోర్‌దాన్ సెవెంటీ క్రోర్స్. ఇదంతా పురుషోతం గారొక్కరితో అయ్యేదా? ఎక్కౌంట్స్, ఎడ్మినిస్ట్రేషన్, మార్కెటింగ్... అంతా చూసుకునేది మీరు. అలాంటి మీకు నెలకు పాతిక వేలు జీతం... అంతేనా? కారూ, పెట్రోలూ ఈ రోజుల్లో ఆర్డినరీ మేనేజర్స్‌కిస్తున్నారు. ఎంత వాటా మీకు ఇస్తే బాగుంటుందో, నేను చెప్పలేను. నా కంపెనీ కాదుకదా!"

ఐస్‌క్యూబ్స్ విస్కీలో కరుగుతున్నట్లు, హిమ్మత్‌భాయి నా మనసులో విస్తరిస్తున్నాడు.

'అన్నయ్యా... ఎన్ని జన్మలకైనా నువ్వు నా అన్నయ్యగానే పుట్టాలి' చెల్లి కళ్లలో వెలుగులు. జీవితంలో ఏనాడూ ఊహించని చీరలు, నగలు... పెళ్లిపీటల మీదికెళ్తూ, తన రెండు చేతులూ పట్టుకుని అందా మాటలు.

పెళ్లిపందిరిలో ఎన్నో జతల కళ్ళమాటున ఆశ్చర్యం... కుళ్ళుబోత్తనం. అలా

తిరుగుతుంటే గాలి మోసుకొస్తున్న మాటలు.

'రాజారాం గాడు బి.కామ్. పాసయ్యాడు. వరసగా మూడేళ్లపాటు వాన చినుకుపడలా. దాంతో పొలం అమ్మకానికి పెట్టారు. మన ప్రాంతం వాళ్లంతా గల్ఫ్ కంట్రీస్‌కి ఎగబడుతున్నప్పుడు వీడు కూడా అటు మొగ్గాడు. పొలం అమ్మిన డబ్బుల్తో ఓ ఏజెంటుగాడిని పట్టుకుని దుబాయి వెళ్లాడు. రెండేళ్లపాటు ఉద్యోగం అన్నారు. రెణ్నెల్లలో తిరిగి వచ్చాడు. అరబ్బీలో ఉన్న వీసా ప్రతాపమది! ఏదో పురుషోత్తంగారి చలవ వల్ల...'

నిజమే. పురుషోత్తం మామయ్యగారి పుణ్యమే. ఆయనో మెకానికల్ ఇంజనీయర్. ఉద్యోగాలకోసం తను ఏనాడూ ప్రయత్నం చేయలేదు. డిగ్రీ కాగానే బ్యాంకు లోనుతో ఇండస్ట్రీ పెట్టారు. నేనూ అంతే. ఆయన్ని కలుసుకున్నాక, లెక్కలు రాయడంతో ప్రారంభించాను. క్రమంగా మార్కెటింగ్ ఆకళింపు చేసుకున్నాను. రెండేళ్లలో మేనేజర్ స్థాయి కెదిగాను. ఆఫీసు బాధ్యతలన్నీ నేను నెత్తినేసుకోవడం వల్ల మామయ్యకు ఉత్పాదనపై దృష్టి కేంద్రీకరించే వీలు కలిగింది. వ్యాపారం విస్తరించింది.

మార్కెట్ ట్రెండును బట్టి నేను ఇచ్చిన సలహాలవల్ల కొత్త వస్తువులు సృష్టించారాయన. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పెద్ద ఫ్యాక్టరీ వెలిసింది. మహారాష్ట్రకు మాత్రమే పరిమితమైన మా తయారీలు ఇతర రాష్ట్రాలకు విస్తరించాయి. దేశవ్యాప్తంగా పటిష్టమైన పంపిణీ వ్యవస్థ ఏర్పాటు చేయడంలో ప్రధానపాత్ర నాది.

మా 'బ్రాండ్ నేమ్' దేశమంతా వ్యాపించింది.

నా కృషివల్ల, బ్యాంకు లోన్లు మంజూరయ్యాయి. కంపెనీ పబ్లిక్ లిమిటెడ్ అయ్యింది. పది రూపాయల షేరు 80 రూపాయలు పలికింది. కార్మికుల సంఖ్య రెండు వందలు దాటుతోంది. ఇదంతా మామయ్య చేసిన సహాయానికి నేను తిరిగి ఇచ్చింది.

ఎక్కడ పొలాలమ్ముకున్నానో, అక్కడే భూములు కొన్నాను. జనరల్ మేనేజరుగా ప్రమోషనొచ్చింది. అప్పుడప్పుడు మా ఊరు కారులో వెళ్తున్నాను. జనం ఆశ్చర్యపోయేవారు.

ఇదంతా మామయ్య భిక్షే అన్నారు. నేను కాదనలేదు.

హిమ్మత్‌భాయి చెప్పాక గాని నేను వెనక్కి తిరిగి చూసుకోలేదు. పాతిక వేల నా జీతం నుండి, టాక్సులు పోను మిగిలేదెంత? నేను చేస్తున్న పనికి, నాకు వస్తున్నదాంతో పోల్చుకున్నా, నా లెవెల్ ఎంప్లాయీస్‌తో పోల్చుకున్నా... షిట్... పదేళ్ళ సర్వీసులో ఒక్క ఫ్లాటు తప్ప, నేను కూర్చుకున్న స్థిరాస్తులేమిటి? ఇంతకూ, మామయ్యాకూ, నాకూ ఉన్న బంధం ఏమిటి? ఉద్యోగమా? బంధుత్వమా?

ఖచ్చితంగా యజమానీ - ఉద్యోగి మధ్యనున్న బంధమే. అంతకుమించి ఏమీ లేదు. 'బంధుత్వం' అన్న పదం నాకంటే ఆయనకే ఎక్కువ ఉపయోగపడుతోంది. వ్యాపారంలో ఆయన బంధుత్వాన్ని పాటించరు. సేల్స్, కలెక్షన్స్, పర్చేజెస్ వీటికి చెందిన స్టేట్‌మెంట్స్ వారం వారం ఆయన టేబుల్‌మీద ఉంచాల్సిందే. ఆలస్యాన్ని భరించలేరు. చాలాసార్లు, నా ముఖం మీద ఆయనన్న మాటలు మననం చేసుకుంటే, ఉద్యోగం మానేసి దూరంగా పారిపోవాలనుకున్నాను. ఆఫీసులో ఎవరేం చేసినా, చేయకున్నా నాదే బాధ్యత. పోనీ అందుకు తగ్గ ప్రతిఫలం ఉందా?... నో...

హిమ్మత్‌భాయి కరెక్ట్. మామయ్య నాకు అప్పనంగా ఇవ్వడంలేదు. చాలా కాలిక్యులేటెడ్‌గా వ్యవహరిస్తున్నాడు.

అందుకే హిమ్మత్‌భాయి ప్రపోజల్ విన్నాక ఆశ కల్గడం. జీవితంలో ఇంకా పైకి, పైపైకి పోవాలని ఆరాటం.

మేము తయారుచేసే వస్తువుల ఫ్యాక్టరీ పెడదామని అతని ఉద్దేశం. ప్రాజెక్టు కాస్టు రెండు కోట్లు. నేను అయిదు లక్షలు పెట్టుబడి పెడితే చాలు. ఇరవై శాతం ఎక్కువ నెల జీతం, కారు, డ్రైవరు, అన్నీ ఇతర వసతులు... కానీ అంత డబ్బు ఎక్కడనుండి తేను? జీతం నుండి కూడబెట్టిందేమీ లేకపోయె!

దాదాపు ప్రతి వారం కలుసుకున్నాం. హిమ్మత్‌భాయి ఉపదేశాలు నామీద బాగా పనిచేశాయి.

ఆరు నెలల కాలందాటిపోయింది...

మానసి, హిమ్మత్‌భాయి కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ వెలిసింది. పాల్‌ఘర్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఫ్యాక్టరీ షెడ్డు లీజుకు తీసుకున్నాం. నా ఫ్లాటు మీద ఉన్న యాభై వేలు లోను తీర్చేసి, ఆ ఫ్లాటుని కొత్త కంపెనీ మీది లోన్లకు సెక్యూరిటీ ఇచ్చాను. అప్పటికే హిమ్మత్‌భాయికి ఉన్న ఆస్తులన్నీ ఇతర వ్యాపారాలకు సెక్యూరిటీగా ఉన్నాయి. మెషినరీకి ఆర్డరు చేశాం.

ఇంకో రెణ్ణెల్లలో ప్రొడక్షన్ ఆరంభం కావాలి.

కానీ.....

## హిమ్మత్‌భాయి హేతువాదం...

హలో, కేమ్‌ఛో? వ్యాపారం మా రక్తంలో ఉంది. చిల్లర వ్యాపారిగా జీవితం మొదలుపెట్టి కొన్ని వేల కోట్ల వాణిజ్య సామ్రాజ్యానికి అధినేత అయిన "రిలయన్స్" ధీరూభాయి అంబానీ, మా రాష్ట్రానికి చెందినవాడే. జిందగీలో ప్రతి బంధం ఆర్థికమే. బిజినెస్ ఈజ్ మై వే ఆఫ్ లైఫ్. నేను మీతో అరగంట మాట్లాడితే ప్రయోజనముండాలి. మీకు ఛాయ్ తాగించినా, మందు కొట్టించినా, ఇవాళో రేపో అది నాకు ఉపయోగపడాలి. అమ్మా, నాన్నా, భార్య, బిడ్డలూ, సోదరులూ, సోదరీమణులు, ఎవరైనా సరే అవసరంతో ముడిపడ్డవారే.

ప్రేమ, ఆప్యాయత, అనుబంధం, అనురాగం... అంతా చెత్త. మనిషికి ముందూ వెనుకా, చుట్టుపక్కలా డబ్బు కావాలి. మనిషి విలువ, అతనికున్న ఆస్తికి అనుపాతంలో ఉంటుంది. అందుకని ఆస్తులు పెంచుకోవాలి. వ్యాపారం విస్తరించాలి. దానికి మనకు సమర్థులు దొరకాలి. అలాంటివారిని పట్టి మంచి జీతం, వసతులతో పాటు వాటా కూడా ఇస్తే? ఇక మనం చెప్పాల్సిన పని ఉండదు. కుక్కల్లా పనిచేస్తారు. లాభాలు గడించి పెడతారు. లేకిన్ యాద్‌రఖ్‌నా... స్టీరింగ్ కభీ నహీ ఛోడ్‌నా...

రాజారాంలో ఆ మెరుపు కనిపించింది. ముగ్గులోకి దించాను, పడ్డాడు. కానీ...

మాకంటే ముందు పురుషోత్తం ఫాస్ట్‌గా మూవయ్యాడు. మంచి అవకాశం

మిస్సయింది. బ్యాడ్‌లక్.

ఇంకోణ్ణి వెదుక్కోవాలి. ఈ ప్రపంచంలో సమర్థులకూ, వారి ఆశలకూ కొదవేముంది?

పందెంలో గుర్రం ఓడిపోతుందని తెలిసి బెట్ కాసేంత సెంటిమెంటలిస్టుని కాదని ముందే చెప్పా కదా? ఇదంతా నాతోనే అయ్యిందని రాజారాం ఏడుపు...

అరె పాగల్, హిమ్మత్‌భాయి నైతే ఔ రేక్ గిమ్మత్‌భాయి నిన్ను టెంప్ట్ చేస్తాడు.

నీ దిమాగేమైంది? మళ్లా షురూ చేయ్... బతుకుని.

అంతకంటే నేనేమంటా... నిమిత్తమాత్రున్ని!

## మానసి మనోవేదన

ఎక్కడి ఆంధ్రదేశం? ఎక్కడి బొంబాయి? నేను ఈ మహానగరానికి వస్తానని అనుకున్నానా? బొంబాయి పేరు వింటేనే అప్పట్లో ఎంత ఆనందమో? ఎంత మక్కువో?

వెదకబోయిన తీగ కాలికి తగిలింది. ఈ సంబంధం రాగానే ఎగిరి గంతేసి ఒంటికాలిమీద ఒప్పుకున్నాను. కానీ ఎందరో మూతి విరిచారు. వెనకాల ఏదేదో మాట్లాడారు. భయపెట్టారు. అంగుళానికొక్కరుగా జనం. ఎక్కడ చూసినా స్లమ్స్. బస్సుల్లో, ట్రైన్లలో విపరీతమైన రద్దీ. వీటికి మించి గ్యాంగ్‌వార్స్.

ఆ తర్వాత?

ఎంతమంది మా యింటికి రాలేదు? ఎన్నిరోజులు ఇక్కడ తిష్ఠ వేయలేదు? మా ఆతిథ్యాన్ని గురించి ఇక్కడా, మా వూళ్లో, ఎన్ని వైనాలుగా చెప్పలేదు? అదృష్టమంటే నాది. అనుకూలురైన శ్రీవారు, సొంత కూతుర్లా చూసుకునే పురుషోత్తం బాబాయి, పిన్ని.

ఇదంతా చూసి భగవంతునిక్కూడా కన్ను కుట్టింది.

మా సంసారంలో హిమ్మత్‌భాయి అనే విషక్రిమి ప్రవేశించింది. నేను కళ్ళు తెరిచేప్పటికే మా ఆశాసౌధాలు నేలకూలాయి. ఒక్కో వాస్తవం తెలుసుకుంటున్న కొద్దీ నాకు మతిపోయినంత పని.

కేవలం ఆరు నెలల కాలం... ఎంత మార్పు?

కొనుగోళ్ళలో కమీషన్లు, అమ్మకాలలో అండర్ ఇన్వాయిసింగులు... నా ఖాతాలో బ్యాంకు బ్యాలెన్సు ఆరు లక్షలకి చేరుకుందని నాకు తెలియదు. ఏవో ఫారాలమీద చెక్కుల మీద, సంతకం పెట్టించుకువెళ్లడం తప్పించి వివరాలు చెప్పేవారు కాదు.

ఓరోజు రాత్రి చెప్పారు...

"నువ్వు ఫ్యాక్టరీ ఓనర్‌వి కాబోతున్నావ్!"

నాకు అర్థం కాలేదు. వివరాలడిగితే చిరునవ్వుతో అన్నారు!

"ఇంకో పది రోజులాగు. నీకో సర్‌ప్రైజ్ ఇస్తున్నా"

అంతదాకా కూడా అవసరం లేకపోయింది.

రెండోరోజు ఉద్యోగం పోయింది. గోడౌన్లకి వేరే తాళాలు వేశారు. కాపలావాళ్లని

మార్చేసారు. 'ఉత్తమ్ గ్రూప్ ఇండస్ట్రీస్'కి రాజారాంతో ఎలాంటి సంబంధం లేదని డిస్ట్రిబ్యూటర్స్‌కి, బ్యాంకులకు ఫాక్స్ మెసేజెస్ వెళ్లాయి. ఆయన ఫోటో వేసి, ఆయనతో ఎలాంటి లావాదేవీలు జరిపినా స్వంత బాధ్యతపైనే జరపాలని, దేశంలోని అన్ని పేపర్లలో ప్రకటనలు వచ్చాయి.

రాజారాంకి మైల్డ్ స్ట్రోకు వచ్చింది. వెన్నుపోటు ఫలితం? గుండెపోటు! పదిరోజులు హాస్పిటల్‌లో ఉన్నాడు.

ఒక్కసారిగా పెను మార్పు. చూడటానికెవరూ రాలేదు. మార్కెట్లో తలెత్తుకోలేని స్థితి. ఇదివరకు గౌరవంతో నమస్కారాలు పెట్టినవారు ముఖం చాటుచేసుకుంటున్నారు. లోన్ డిస్బర్స్‌మెంట్స్ ఆగిపోయాయి. ఇచ్చిన లోన్స్ 'రీ కాల్' చేశారు. ఆశ స్వార్థానికి, స్వార్థం వినాశనానికి దారితీసింది.

హిమ్మత్‌భాయ్ ఇంటికేసి చూడటం మానుకున్నాడు. అప్పులు మా మీద రుద్దేసి తన పెట్టుబడి రాబట్టుకున్నాడు.

బాబాయిగారి వ్యాపారానికేం ఢోకాలేదు. నిరాటంకంగా సాగుతోంది. ఇప్పుడింకా అమ్మకాలూ, లాభాలు పెరిగాయంటున్నారు. ఆశయం మంచిదైతే దైవం కూడా తోడ్పడుతుందంటారు. ఇందుకేనేమో! బాబాయి ముఖం చూడాలంటే సిగ్గుతో చచ్చిపోతున్నాను. నాకేమాత్రం తెలిసినా ఇలా జరిగేదు కాదు.

మా వారి అంతర్మథనం చూడలేకున్నాను. వాపును చూసి బలం అనుకున్నారాయన. ఆ గౌరవాలన్ని తనవనుకున్నారు. అవి కంపెనీకి చెందిన తన హోదాతో ముడిపడి ఉన్నాయని తెలుసుకోలేకపోయారు.

బాబాయిగారి వ్యాపార దక్షత, ఉదారతను ఇంకోలా అర్థం చేసుకున్నారు. నా బలవంతంమీద, హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయ్యాక బాబాయిని కలిశాము. ఆయనన్న మాటలు చెవిలో ఇంకా గింగురుమంటున్నాయి.

'ఒక్కసారి ఆరోజు తలుచుకో రాజారాం. మామయ్యా! నీ కాళ్ల దగ్గర ఇంత చోటివ్వు. నువ్వేం చెబుతావో ఆ పని చేస్తానన్నావు... బంధువనే కాదు సాటి తెలుగువాడిగా నిన్ను చేరదీసాను. పనిలో నువ్వు చూపించిన శ్రద్ధకు తగిన రీతిలో జీతం పెంచాను. ప్రమోషన్లు ఇచ్చాను. నువ్వు అంతటితో సరిపెట్టుకోలేదు. ఇంకా ఆశపడ్డావు. పైకి, పైపైకి ఎగబాక గలననుకున్నావ్. తప్పులేదు. నాతో ఓ మాట చెప్పావా? నీకింకా తెలియదు. ఇంకో ఆర్నెల్లలో చిత్తూరు దగ్గర పెట్టబోయే టైర్ల ఫ్యాక్టరీకి, నిన్ను మానేజింగ్ డైరెక్టరుగా నియమించాలనుకున్నాను. ఆ ప్రాజెక్టు డిటెయిల్స్ ఇదిగో ఈ ఫైళ్లలో ఉన్నాయి.'

రాజారాం ఓసారి తలెత్తి, దించుకున్నాడు.

'ఇంత పెద్ద వ్యాపారంలో ఆరు లక్షలు ఏ పాటనుకున్నావ్? ముందు నన్ను ఓ భయంకరుడిగా ఊహించుకున్నావ్. నిజమే, నేను బిజినెస్ మ్యాన్‌నే. అందుకే నీకు ఉద్వాసన పలికాను. నీకు రావలసిన బకాయిలు, పది రోజుల్లో క్లియర్ చేస్తాను. నువ్వు వెళ్లవచ్చు...'

నేను రెండు చేతులూ జోడించాను. మౌనంగా బయటకి వచ్చాం. సంవత్సరం దాటిపోయింది. రాజారాం పిచ్చివాడిలా తయారయ్యాడు.

ఎప్పుడూ ఆ సముద్రపు ఒడ్డునే...

పూలమ్మిన చోట కట్టెలమ్మడం అంటే ఏమిటో అనుభవంలోకి వచ్చింది. ఉద్యోగ ప్రయత్నాలు చేశారు.. వ్యాపారంలో చేతులు కాల్చుకున్నారు. ప్రతిచోటా వారి గతం అడ్డు వచ్చింది. తాడులేని బొంగరంలా అయింది మా జీవితం.

ఈ మధ్య కాలంలో మా పుట్టింటివారు గానీ, అత్తింటివారు గానీ, ఇటు ముఖం తిప్పలేదు. ముఖ్యంగా ఆయన్ని 'గాఢంగా' ప్రేమించిన చెల్లాయి!

లాభం లేదు. ఇంక ఆలస్యం చేయగూడదు. బాబాయిగారి దగ్గరికి, ఆయనతోపాటు వెళ్లి, మా పొరపాటును క్షమించమని వేడుకోవాల్సిందే.

## పురుషోత్తం పునరావలోకనం

"గాడ్ హెల్ప్స్ దోజ్ హూ హెల్ప్ దెమ్‌సెల్ఫ్" అని నా ప్రగాఢ నమ్మకం.

రాజారాం తల్లి, మా పిన్ని కూతురు.

"ఉత్తమ్ ఇండస్ట్రీస్" ఏర్పడటానికి కారణం డబ్బు సంపాదన మాత్రమే కాదు. అది మొదటి ఉద్దేశం మాత్రమే. రెండోది, పదిమందికి ఉపాధి కల్పించాలనే ఆరాటం. దగ్గరి బంధువులని తీసుకుంటే చాలా ఇబ్బందులుంటాయని, హితైషులు హెచ్చరించారు. రెండు మూడు రోజులు ఆలోచించాను.

గుజరాతీ మార్వాడీల వ్యాపారాల్లో కీలక వ్యక్తులు, వారి దగ్గర బంధువులే. వారికి అడ్డురాని బంధుత్వం, మన వ్యాపారానికి మాత్రం అడ్డంకు ఎందుకు కావాలనిపించింది. మన వాళ్లను, మనం ఆదుకోకపోతే ఇంకెవరు ఆదుకుంటారని, ఎదురుప్రశ్న వేసుకున్నాను.

రాజారాంలో స్పార్క్ ఉంది. బంధువు అనే కారణంచేత అతన్ని ఎందుకు నిరుత్సాహపరచాలి?

నాకు చెందిన ఆలోచనలు, కలలు నావి.

"వి.ఐ.పి. అండర్‌వేర్ల జయపాల్‌రెడ్డిగారిలా ఇంటింటా 'ఉత్తమ్' పేరు మార్మోగాలి. ప్రపంచ పౌల్ట్రీ పరిశ్రమలో తనదైన స్థానం ఏర్పరచుకున్న 'శ్రీ వేంకటేశ్వర హేచరీస్', 'బాలాజీ ఫుడ్స్' బందా వాసుదేవరావు గారిలా 'ఉత్తమ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్' ప్రపంచమంతా కలియబెట్టాలని నా ఆశయం.

పరాయివారికి లాభాలు గడించిపెట్టే మన తెలుగువారి నైపుణ్యం, మన వారికి, మన దేశానికి ఉపయోగపడాలనేది నా అభిమతం.

ఓ పరిశ్రమ స్థాపించి దాని లాభాలతో అనుబంధ పరిశ్రమలను నెలకొల్పి, దానికి అధినేతగా నమ్మకస్థుడైన వ్యక్తినుంచుతూ నా వాణిజ్య సామ్రాజ్యాన్ని విస్తరింపజేయాలని నా ఆకాంక్ష. అలా ఉడతాభక్తిగా మన దేశ మాత రుణం తీర్చుకోవాలని నా ఆరాటం.

ఈ ప్రయోగానికి నేనెన్నుకున్న మొదటి వ్యక్తి రాజారాం. నా ఆశయాలకి చిన్న షాక్. తెలుగువాడు మరో తెలుగువాడికి చేయూతనివ్వడనే అపప్రథ తొలగించాలనే నా ప్రయత్నానికి కలిగిన అఘాతం. బంధుత్వాన్ని కాపాడుకుంటూ వ్యాపారంలో మన సమష్టి

కృషి గురించి కొత్తగా ఆలోచిస్తే తప్ప పారిశ్రామిక రంగంలో మనం ముందుకు వెళ్లలేమనే నా ఆలోచనను పునరావలోకనం చేసుకునే పరిస్థితి.

మన రాష్ట్రంలో, కీలక పరిశ్రమలు ఎవరి చేతుల్లో ఉన్నాయి?

అవి ఎందుకని విజయవంతమయ్యాయి? జాగ్రత్తగా ఆలోచిస్తే కానీ పాఠాలు లభించవు.

ఇది ప్రాంతీయ దృష్టితో చూడటం కాదు. మనం, మనవారి అభివృద్ధి కొరకు తులనాత్మకంగా చేసే పరిశీలన. అందుకే రచ్చ గెలిచి, ఇంట గెలవాలని, బొంబాయిలో మా వాణిజ్య సౌధానికి పునాదులు వేశాను. మెల్లగా మన రాష్ట్రానికి విస్తరించాలనుకున్నాను.

రాజారాం దగాతో నేను కుంగిపోను. కీలెరికి వాత పెట్టడం పూర్తయింది. నా దగ్గర నమ్మకస్థులు ఇంకా చాలామంది ఉన్నారు. రాజారాం అనుభవం వారికి పాఠంలా పనిచేస్తుందని భావిస్తున్నాను.

రాజారాం భార్య మానసి నుండి ఫోన్...

"బాబాయ్‌గారూ, ఓసారి మీ ఇంటికి రావచ్చా" అని.

"వై నాట్? మోస్ట్ వెల్‌కం" అన్నాను.

రేపు ఆదివారం వస్తున్నారు.

## ఉపసంహారం

ఆదివారం...

ఉదయం పది గంటలు...

జె.వి.పి.డి. స్కీం అమితాబ్ బచ్చన్ 'పతీక్ష' దగ్గర అతని దర్శనం కోసం నిరీక్షిస్తున్నారు చాలామంది. రాజారాం దంపతులు వచ్చింది మాత్రం ఆ 'సూపర్‌స్టార్' కోసం కాదు. ఆ వీధిలోనే ఉన్న పురుషోత్తంగారి ద్వారా తమ 'స్టార్' మారుతుందేమోనని.

డ్రాయింగ్ రూములో తల వంచుకుని కూర్చున్నాడు రాజారాం. గుండె కొట్టుకోవడం వినిపిస్తోంది. ఇలాంటి స్థితి ఇంతకుముందు లేదు. అసలిలా ఎదురుచూపులంటూ ఉండేవి కావు.

సరిగ్గా అరగంట తర్వాత పురుషోత్తం వస్తూ...

"సారీ, అర్జెంటు కాల్స్ మాట్లాడి రావాల్సి వచ్చింది" అంటూ ఉండగా ఇద్దరూ లేచి నిలబడ్డారు. రాజారాం అమాంతం వెళ్లి కాళ్ళమీద పడిపోయాడు.

అలానే ఉండి కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు.

పురుషోత్తంగారు ఊహించని స్థితి అది.

మెల్లిగా అతన్ని లేపారు. చల్లని నీళ్లతో ముఖం కడుక్కున్నాక సోఫాలో కూర్చున్నాడు రాజారాం.

"ఏమిటయ్యా చిన్నపిల్లాడిలా" అన్నారాయన.

"లేదు మామయ్యా, అన్నం పెట్టిన చేతికి ద్రోహం తలపెట్టాను. నన్ను ఏం చేసినా పాపం లేదు. క్షమించమని కూడా అడగలేను."

"ఏమ్మా మానసీ, పిల్లలెలా ఉన్నారు?"

"ఏదో అలా బతుకు నెట్టుకొస్తున్నాం బాబాయిగారూ... మీకు తెలియనిదేముంది?"

తల పంకించాడాయన.

"సార్, ఇప్పుడు నాలో ఎలాంటి ఆశ లేదు. అహంకారం లేదు. మీ ఆఫీసులో అటెండరుగా పని చేయటానిక్కూడా సిద్ధంగా ఉన్నాను. నీ పంచన తప్ప నాకిక తావు లేదు. ఒడ్డు నుంచినా నీట ముంచినా మీదే భారం."

పురుషోత్తంగారు నౌకర్ని పిలిచి చెప్పారు. భోజనం ఏర్పాట్లు చూడమని. ఇద్దరూ లేవబోయారు.

"అదేంటల్లుడూ, భోంచేయకుండా వెళ్తారా? చేతులు కడుక్కోండి."

రాజారాం చేతులు కడుక్కున్నాడు. కాదు... తనలోని కల్మషాన్ని కడిగేసుకున్నాడు.

దగ్గరుండి వడ్డింపచేశారు పురుషోత్తంగారు, కానీ రాజారాం దంపతుల్లో అపరాధ భావం. అంతలోనే ఎక్కడో ఆశ. మావయ్య మనసు చాలా మంచిది. ఇంత ఆప్యాయంగా ఉన్నారంటే తిరిగి కొత్త జీవితం ఆరంభించవచ్చేమో!

* * *

వక్కపొడి వేసుకుని పేపరు అందుకున్నారు పురుషోత్తం. చాలాసేపు నేలమీద కాలివేళ్ళతో గీతలు గీశాడు రాజారాం.

"ఇంక బయల్దేరుతాం బాబాయిగారూ" అంది మానసి.

"ఆ... మంచిదమ్మా. అప్పుడప్పుడూ వస్తూ ఉండండి. ఈ మహానగరంలో మాకున్న దగ్గరివారిలో మీ కుటుంబం ఒకటి గదా" అన్నాడాయన.

"అంకుల్... మరి... ఆఫీసుకి... ఎప్పుడు.." నసిగాడు.

"ఆ విషయం మర్చిపో రాజారాం" పురుషోత్తంగారు.

"అంటే మీరు నన్ను క్షమించలేదు. చిన్నప్పటి 'దురాశ దుఃఖానికి చే'టన్న సామెత నిజమని అనుభవపూర్వకంగా నేర్చుకున్నాను మావయ్యా."

భుజం మీద చెయ్యి వేశాడాయన. "నేనూ నేర్చుకున్నాను పాఠం. అందుకు ధన్యవాదాలు చెప్పాలి నీకు. ఈ ప్రపంచం చాలా విశాలమైనది. నీలో నిజంగా మార్పు వస్తే తప్పకుండా మరో మార్గం దొరుకుతుంది. నీ ఆశయ పూర్తికి నా చేతనైన సహాయం చేస్తాను. ఒక్కటి మాత్రం నిజం.

"ఫెమిలియారిటీ బ్రీడ్స్ కంటెంప్ట్' అని ఊరికే అనరు. దగ్గరుంచుకుని సంబంధాలు చెడగొట్టుకోవటం కంటే దూరంగా ఉండే, బాగోగులు కనుక్కోవటం మంచిదేమో! ఐ విష్ యూ ఆల్ ద బెస్ట్."

"థ్యాంక్యూ మావయ్యా" మనస్ఫూర్తిగా అన్నడు రాజారాం. అతని మనస్సు నిర్మలంగా

ఉంది. ఎందుకో తెలియని ఆత్మవిశ్వాసం.

మానసి చేతులందుకుని అన్నాడు -

"ఓసారి మనం సముద్రాన్ని చూద్దాం."

పురుషోత్తంగారి పెదవులమీద చిరునవ్వు కదలాడింది...

ఆశను వీడి సదాశయంతో ఓ కొత్త జీవితంవైపు అడుగులేస్తున్న రాజారాంను చూసి.

**(రచన మాసపత్రిక ఫిబ్రవరి 1998)**